

కేసీఆర్ కిట్లతో లబ్ధిదారుల సహాయకులు

# కేసీఆర్ కిట్.. సూపర్ హిట్

## ప్రభుత్వ ఆస్పత్రుల్లో పెరిగిన ప్రసవాలు

**72.36 శాతం మంది గర్భిణులు సర్కారు దవాఖానలకే..**

**ప్రైవేట్ ఆస్పత్రుల్లో తగ్గిన కాన్పులు**

**ఇప్పటి వరకు 72,695 కేసీఆర్ కిట్ల పంపిణీ**

**అమ్మఒడి పథకం కింద రూ.90 కోట్ల లబ్ధి**

నీలగిరి, నవంబర్ 15 : మాతా శిశు సంరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అమ్మఒడి–కేసీఆర్ కిట్ పథకానికి జిల్లాలో అనూహ్య స్పందన లభించింది. ఈ పథకం ఆడబిడ్డలకు వరంగా మారడంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలకు గర్భిణులు క్యూ కడుతున్నారు. మగ శిశువు పుడితే రూ.12 వేలు, ఆడశిశువు జన్మిస్తే రూ.13 వేల నగదు, తల్లీబిడ్డల సంరక్షణకు 16 వస్తువులతో కూడిన కేసీఆర్ కిట్ ఇస్తుండడంతో సర్కారు దవాఖానలకు వెళ్లేందుకే మొగ్గ చూపుతున్నారు. దాంతో ప్రవేట్ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య తగ్గి, ప్రభుత్వ ఆస్పత్రుల్లో గణనీయంగా పెరిగింది. ఈ పథకం ప్రారంభమైన నాటి నుంచి జిల్లాలో 1,60,139 ప్రసవాలు జరిగితే ప్రభుత్వ ఆస్పత్రుల్లో 1,15,883 ప్రసవాలు జరుగగా, ప్రైవేట్ ఆస్పత్రుల్లో 44,256 ప్రసవాలు మాత్రమే జరిగాయి. కేసీఆర్ కిట్ పథకం లేకముందు ప్రభుత్వ ఆస్పత్రుల్లో కేవలం 23 శాతమే ప్రసవాలు జరుగగా, ప్రస్తుతం 72.36 శాతానికి పెరిగింది. కేవలం 27.64 శాతం మాత్రమే ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవించిన వారికి 72,695 కేసీఆర్ కిట్లను పంపిణీ చేశారు. అలాగే అమ్మఒడి కింద రూ.90 కోట్ల నగదు వారి ఖాతాల్లో జమ చేశారు. వీరిలో ఉద్యోగస్తులు, ధనవంతులు కూడా ఉండడం విశేషం.

రాష్ట్రంలో మాతా శిశు మరణాలను అరికట్టడంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణులు ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాలు చేయించుకునేలా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం 2017 జూన్ 3న కేసీఆర్ కిట్‌ను ప్రారంభించింది. ఆరేండ్లుగా ఈ పథకం సత్ఫలితాలిస్తున్నది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవించేందుకు మహిళలు గర్భం దాల్చిన వెంటనే ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేయించుకుంటున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు సుమారు 1,70,129 వరకు గర్భిణులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోగా, అందులో 1,60,139 మందికి ప్రభుత్వ దవాఖానల్లోనే ప్రసవాలు జరిగాయి. ఈ పథకం రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవడమే కాకుండా 16 రకాల వస్తువులను అందజేస్తుండడంతో జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెరుగుతున్నాయి. జిల్లా కేంద్ర దవాఖానలో అత్యధికంగా ప్రసవాలు జరుగుతున్నాయి. కేసీఆర్ కిట్ పథకం ద్వార ఆర్థికంగా అదుకోవడంతోపాటు పుట్టిన బిడ్డను కాపాడుకునేందుకు, అనారోగ్యం బారిన పడకుండా చూసుకునేందుకు ఇస్తున్న వస్తువులు ఎంతో ఉపయోగ పడుతున్నాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మ ఒడితో సర్కారు దవాఖానలపై ప్రజలకు భరోసా పెరిగింది. దాంతో ప్రభుత్వ ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు.

### సర్కారు దవాఖానల్లో సకల సౌలత్‌లు

కేసీఆర్ కిట్, అమ్మఒడి పథకాలతో గర్భిణులంతా ప్రభుత్వ దవాఖానలకే క్యూ కడుతున్నారు. పథకాలతోపాటు ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తుండడం, మౌలిక వసతులు కల్పించడంతో ఇక్కడికే వస్తున్నారు. జిల్లాలో గర్భిణులుగా నమోదైన వారిలో దాదాపు 72.36 శాతం మంది ప్రభుత్వ దవాఖానలకు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేసీఆర్ కిట్ పథకం ప్రకటించక ముందు జిల్లాలో 2016లో 21,519 మంది మహిళలు గర్భం దాల్చితే వారిలో 4,719 మంది ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చారు. 15,800 మంది ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం కోసం వెళ్లగా, మిగతావారు ఇంటి వద్దనే ప్రసవించారు. కేసీఆర్ కిట్ వచ్చిన తరువాత ఈ సంవత్సం జిల్లాలో 21,265 మంది గర్భం దాల్చితే 14,810 మంది(72.36 శాతం) ప్రభుత్వ ఆస్పత్రులకు రాగా, కేవలం 27.64 శాతం మాత్రమే ప్రైవేట్ దవాఖానలకు వెళ్లారు.

### పెరిగిన సాధారణ ప్రసవాలు..

కేసీఆర్ కిట్‌తో జిల్లా కేంద్ర దవాఖానతోపాటు పీహెచ్‌సీల్లో సైతం పెద్దఎత్తున ప్రసవాలు జరగుతున్నాయి. జిల్లాలో 35 పీహెచ్‌సీలు ఉండగా, అందులో 18(24 గంటల) ఆరోగ్య కేంద్రాలు, 257 ఆరోగ్య ఉప కేంద్రాలు, ఒక సీహెచ్‌సీ, 5 పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఇవి కాకుండా జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి ఆధీనంలో జిల్లా కేంద్ర దవాఖాన, 3 ఏరియా ఆస్పత్రులు, ఒక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఉన్నాయి. ఇవి కాకుండా ప్రజావైద్యాన్ని ప్రజలకు చేరువ చేసేందుకు జిల్లాలో కొత్తగా 195 పల్లె దవాఖానాలు, 7 బస్తీ దవాఖానలు ఏర్పాటు చేశారు. ఫలితంగా సిజేరియన్ల సంఖ్య తగ్గి సాధారణ ప్రసవాల సంఖ్య పెరిగింది. 2016లో 4,719 మంది గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్తే కేవలం 566 సాధారణ ప్రసవాలు, 4,153 సిజేరియన్లు జరిగాయి. అదే ప్రైవేట్ ఆస్పత్రుల్లో 15,800 మందిలో 790 సాధారణ ప్రసవాలు కాగా, 15,010 సిజేరియన్లు జరిగాయి. ఈ సంవత్సరం 10,187 మంది ప్రభుత్వ ఆస్పత్రికి రాగా 8,590 సాధారణ ప్రసవాలు జరుగగా వీటిలో 1,597 సిజేరియన్లు జరిగాయి. 11,276 మంది గర్భిణులు ప్రైవేట్ ఆస్పత్రులకు రాగా, అందులో 6, 220 సాధారణ ప్రసవాలు కాగా, 5,059 మందికి సిజేరియన్లు జరిగాయి.



కేసీఆర్ కిట్లతో బాలింతలు

# పోడు భూముల్లో సాగు సంబురం

**నాడు భయంగా..**
**నేడు నిర్భయంగా సాగు**

**గిరిజన రైతుల్లో ధైర్యం నింపిన సీఎం కేసీఆర్**

దామరచర్ల, నవంబర్ 15 : అటవీ భూమిని సాగు చేసుకుంటున్న గిరిజన రైతులకు పట్టాలు ఇస్తానని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని నెరవేర్చడంతో రైతులు ఆ భూములను సాగుచేస్తూ మేలైన పంటలు పండిస్తున్నారు. మండలంలోని సన్న, చిన్నకారు రైతులు అటవీభూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొన్నేండ్లుగా భయం భయంగా వర్షాధార పంటలను మాత్రమే సాగు చేసేవారు. అటవీ శాఖ అధికార్లు కొన్ని సమయాల్లో వేసిన పంటలను తొలగించి కేసులు నమోదు చేసిన సంఘటనలున్నాయి. పలుసార్లు ఘర్షణలు కూడా చోటుచేసుకున్నాయి. స్వరాష్ట్రంలో నేడు ఆ పరిస్థితి లేదు. సీఎం కేసీఆర్ ఇచ్చిన పోడు పట్టాలతో సగర్వంగా వారికి నచ్చిన పంటలు సాగు చేసుకుంటూ ఆనందంగా జీవిస్తున్నారు.



కల్లేపల్లి శివారులోని అటవీ భూమిలో సాగు చేసిన చేనులో కలుపు తీస్తున్న రైతులు

### 532 మందికి పోడు పట్టాలు

మండలంలోని కృష్ణా, మూసీ నదుల తీరంలోని అటవీ భూముల్లో గిరిజనులు కొన్నేండ్లుగా సాగు చేసేవారు. కేవలం వర్షాధార పంటలైన పత్తి, మినుము, కంది తదితర పంటలు మాత్రమే వేసేవారు. ఈ నేపథ్యంలో సీఎం కేసీఆర్ హామీ మేరకు మండలంలోని దామరచర్ల, కల్లేపల్లి, తిమ్మాపురం, రాళ్లవాగుతండా, కేశవాపురం, తెట్టెకుంట, రామోజీతండా, ఎల్‌బీతండా, దిలావర్‌పూర్, వీర్లపాలెం పరిసర గ్రామాల్లోని 532 గిరిజన కుటుంబాలకు వెయ్యి ఎకరాలకు పట్టాలు అందజేశారు. దాంతో అధికారుల భయం లేకుండా కృష్ణా, మూసీ నదుల తీరంలోని అటవీ భూములకు పైపులైన్లు వేసుకొని వరితోపాటు పత్తి, మిర్చి సాగు చేసుకుంటున్నారు. కొంత మంది రైతులు పొలాల్లో బోర్లు వేయించుకుంటున్నారు. విద్యుత్ సరఫరా ఉన్న రైతులు బోర్లు బిగించి సాగు చేసుకుంటున్నారు. ఆశించిన రీతిలో వరి దిగుబడి రావడం, మద్దతు ధర అధికంగా ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### ఆటంకాలను అధిగమించి..

గతంలో అటవీ భూముల్లో సాగు చేసుకుంటున్న రైతులకు నిత్యం ఒక గండంగా ఉండేది. అటవీ శాఖ అధికారులు వచ్చి ట్రాన్స్‌ఫార్మర్లు తొలగించడం, విద్యుత్ కనెక్షన్లు కట్ చేయడం, పైపులైన్లు పగులగొట్టడం, కేసులు నమోదు చేయడం నిత్యం పరిపాటిగా ఉండేది. దాంతో గిరిజన రైతులు వివిధ రకాలుగా నష్టపోయారు. స్వరాష్ట్రంలో, సీఎం కేసీఆర్ పాలనలో పోడు భూములకు పట్టాలు అందజేయడంతో సమస్యలన్నీ తొలిగి గిరిజన రైతులంతా సంబురంగా సాగు చేసుకుంటున్నారు. అంతేకాకుండా గతంలో రైతులపై సుమారు 120 కేసులు నమోదు కాగా, వాటిని కూడా ఎత్తివేస్తున్నట్లు చెప్పడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కల్లేపల్లి శివారులోని అటవీ భూమిలో పత్తి ఏరుతున్న గిరిజన రైతు